

క్లుప్తంగా...

ప్రధానరోడ్డుపై మురుగు



మణికొండ: అది హైదరాబాద్ నగరాన్ని మణికొండ మున్సిపాలిటీని కలిపే ప్రధాన రోడ్డు. దీనిపై మురుగు పరుగులు పెడుతుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ నుంచి షేక్‌పేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై లాలమ్మ గార్డన్ ఎదురుగా ప్రధానరోడ్డుపై మురుగునీరు ప్రతి రోజు ప్రవహిస్తుంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరం



రాజేంద్రనగర్: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ టీచర్ కనకవ్వ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారన్నారు. కార్యక్రమంలో మాధవి, అనిత, రత్నకుమారి, ఆశావర్కర్లు రేణుక, సునీత, మంగ, మణెమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలం



గోల్కొండ: ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ శ్రీకృష్ణ భవన్‌లో బీసీ ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యంగా లేకపోవడం వల్లే నేడు ఎన్నో కులాలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగలేకపోయాయన్నారు. కాగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కుల సంఘాలు పటిష్టంగా ఉన్నాయని ప్రభుత్వాలతో పోరాడి అవి తమ హక్కులు సాధించుకున్నాయన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవులకు గతంలో చట్ట సభల్లో మంచి ప్రాతినిధ్యం ఉండేదని నేడు వాటి ప్రాధాన్యం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ



గోల్కొండ: పేద విద్యార్థులకు తెలంగాణ యూత్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ తమవంతు సహాయంగా నోటు బుక్స్, పాఠ్య పుస్తకాలు అందిస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ అలీ అన్నారు. సోమవారం ఆయన జోషివాడీ కార్వాన్‌లోని భగత్‌సింగ్ ప్రైమరీ హైస్కూల్‌లో విద్యార్థులకు నోటు బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు బాగా చదువుకునేలా దశాబ్ద కాలంగా కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మరింత శ్రద్ధ కనబరిచేందుకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ షాకీర్, జోషి సమాజ్ అధ్యక్షుడు ఈశ్వర్‌జోషి, పాఠశాల ఉపాధ్యాయులు వనిత, నవీన్ తదితరులున్నారు.

నార్సింగిలో చైన్‌స్నాచింగ్

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మెడలోని చైన్‌ను లాక్కుని వెళ్లిన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో యోగీంద్ర అతని భార్య, బావమరిదితో కలిసి పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద బస్ దిగారు. అక్కడ క్యాబ్‌లు ఎక్కేందుకు కొద్ది దూరం నడవాల్సి ఉండటంతో సర్వీసు రోడ్డుపై నడుచుకుంటు వస్తుండగా వెనకనుంచి హోండా యాక్టీవాపై వచ్చిన ఇద్దరు దుండగులు అతని మెడలోని చైన్ లాక్కున్నారు. అంతలోనే బాధితుడు తేరుకుని ప్రతిఘటించే ప్రయత్నం చేయగా చైన్ సగం తెగి అతని చేతిలో ఉండగా మిగతా సగం తీసుకుని నిందితులు పరారయ్యారు. తులంన్నర(15గ్రాములు) బంగారం చైన్‌స్నాచింగ్ జరిగిందని నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆకర్షణీయంగా లింగంపల్లి ప్రాథమిక పాఠశాల
కొత్తగా నిర్మించిన తరగతి గది

విద్యార్థుల భవిష్యత్ 'నిర్మాణ్'

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా లింగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- 'నిర్మాణ్' సంస్థతో సరికొత్త శోభ
- మౌలిక వసతులు, పెయింటింగ్స్‌తో కొత్తరూపు
- త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలు తయారవుతున్నాయి. పేద, మధ్య తరగతి పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే ప్రభుత్వ విద్యాలయాలలో ఒకవైపు ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' ద్వారా మరోవైపు ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు కూడా మేముసైతం అంటూ ముందుకురావడంతో కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. అందులో భాగంగా 'నిర్మాణ్' సంస్థ లింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసుకుంది. ఈ ప్రాథమిక పాఠశాలలో 284 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు.

– శేరిలింగంపల్లి



'నిర్మాణ్' సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు..

- లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.13 లక్షలతో ఒక క్లాస్‌రూమ్, రూ.6.50 లక్షలతో మోడల్ టాయిలెట్స్ (బాలికలు, బాలురకు వేర్వేరుగా) నిర్మించారు.
- తరగతి గదులు, ఆఫీస్ రూమ్‌లకు ఎలక్ట్రికల్ వైరింగ్, 12 ఫ్యాన్లు, 12 ట్యూబ్ లైట్స్‌ను అమర్చారు.
- ఇప్పటికే తరగతి గదుల్లో పెయింటింగ్ పనులు పూర్తి చేశారు.
- స్కూల్ గోడలపై విద్యాపరమైన అంశాలతో కూడిన పెయింటింగ్ ,కరిక్యులమ్ రిలేటెడ్ పెయింటింగ్స్ వేశారు.
- ఈ పాఠశాల చుట్టూరా ప్రహరీ గోడ నిర్మాణం
- ఒక్కో విద్యార్థికి ఆటబొమ్మలు, బ్యాగు, వాటర్ బాటిల్స్, లైబ్రరీ బుక్స్, జామెట్రీ బాక్స్ అందించారు.
- త్వరలో రూ. 5లక్షలతో ఆర్ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



పాఠశాల గోడలపై పెయింటింగ్స్



మోడల్ టాయిలెట్స్

సంతోషంగా ఉంది



లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిర్మాణ్ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉంది. క్లాస్ రూం, మోడల్ టాయిలెట్స్ నిర్మించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటోంది.

-భీమయ్య, హెచ్ఎం, లింగంపల్లి ప్రభుత్వ పాఠశాల

స్కూల్ రూపురేఖలు మారాయి



నిర్మాణ్ సంస్థతో లింగంపల్లి ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మారాయి. ఈ పాఠశాల అభివృద్ధికి వారు చేస్తున్న కృషి అభినందనీయం. ఆర్ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలకు వసతులు కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది.

– శ్రీనివాస్, లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి

ఫ్రెషర్స్ డే.. ఆటపాటలు, ర్యాంప్ వాక్



రాజేంద్రనగర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భవానీ కాలనీలోని గాయత్రి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ కళాశాల చైర్మన్ డి.బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో బ్లూమ్ అప్.. ది బడ్డింగ్ స్ట్రేస్ పేరుతో ఫ్రెషర్స్ డే-2023ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు, ర్యాంప్ వాక్ తదితర కార్యక్రమాలు విశేషంగా కట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఫ్రెషర్స్ డేను ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ హరికారెడ్డి, ప్రిన్సిపల్ అర్చన, గాయత్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు



ఆరాంఘర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం పేదలకు తీరనిలోటు అని కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ కార్యదర్శి సానం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.ధనుంజయ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు కోరని బాలరాజ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలేద్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, రాజేంద్రనగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకల్ల నాగేందర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేష్, నర్సింహ్మాయాదవ్, రవీందర్‌రెడ్డి, జనార్దన్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు మహేష్, ముస్తాఫా, సదానంద్‌కుమార్, హరి, బబ్లుముదిరాజ్, చిన్న, రామ్ చందర్ పాల్గొన్నారు.

నిరసన దీక్ష.. వినతి



రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. బుద్వేల్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసన దీక్షలో శంషాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్ మండలాలకు చెందిన విలేకరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విలేకరులకు ఇంటి స్థలాలను ఇవ్వడంతో పాటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డులు పని చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మరణించిన విలేకరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెలంగాణ వైఎస్ఆర్‌టీపీ, బీఎస్‌పీలతో పాటు పలు యువజన, కుల సంఘాల ప్రజాప్రతినిధులు, నాయకులు నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అంతర్జాతీయ తైక్వాండోలో రాణించిన అబ్దుల్ ఖలీల్



మణికొండ: మలేషియాలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్‌లో నార్సింగికి చెందిన అబ్దుల్ ఖలీల్ బంగారు పతకాన్ని సాధించాడు. ఈనెల 5వ తేదీనుంచి కొనసాగుతున్న పోటీలలో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. బ్లాక్ బెల్ట్ 5డన్ విభాగంలో పోటీ పడి బంగారు పతకాన్ని సాధించారు. గతంలోను తొమ్మిది సార్లు అంతర్జాతీయ చాంపియన్ షిప్‌లు, 11 సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రాండ్ మాస్టర్ ఎం.జయంత్‌రెడ్డి అభినందించారు.

సమాజ సేవకు 'జేసీఐ హైదరాబాద్ దక్కన్' కృషి



వేడుకల్లో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ నిరంతరం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా జేసీఐ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా తంబోలా, మ్యూజికల్ ఫ్యాషన్ షో వేడుకలను బీజేపీ నాయకురాలు భాగవతి బల్‌దేవాతో కలిసి ప్రారంభించారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. జేసీఐ హైదరాబాద్ దక్కన్ తరహాలో మిగతా సంస్థలు కూడా సమాజ సేవకు పాటుపడాలన్నారు. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ప్రజా సంక్షేమం కోసం, పేద ప్రజల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపట్టిందని ఆయన కొనియాడారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

బండ్లగూడ: పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సభ్యత్వ వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ రాజేంద్రనగర్ బాలికల, ఎఫ్ఎల్ఎస్ ట్రెనింగ్ సెంటర్ హైదర్షాకోట్‌లలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పీఆర్‌సీ కమిటీ వేయించి ఐఆర్ వచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డులు తీసుకువస్తామన్నారు. మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల 317 సమస్యలు, ట్రాన్స్‌ఫర్స్, ప్రమోషన్స్ రెండవ శనివారం పని చేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్, జీతాలు ఇచ్చే విధంగా, కేర్ టేకర్స్ సమస్యల పైన పోరాటాలు చేస్తామన్నారు.కార్యక్రమంలో గండిపేట మండల శాఖ అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాములు, జిల్లా ఉపాధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సురేష్, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాధిక తదితరులున్నారు.

చిత్రపురి కాలనీలో ఓటరు నమోదు



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

మణికొండ: తాము ఉంటున్న చోట ఓటు హక్కు తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో ఓటు ఉండి ఇక్కడ నివసించటం వలన స్థానికంగా జనాభా తక్కువగా లెక్కలోకి వచ్చి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు తక్కువగా మంజూరు అవుతాయన్నారు. దాంతో మున్సిపాలిటీలకు సరియైన ఆదాయం రాక అనుకున్న మేర అభివృద్ధి పనులు చేపట్టలేకపోతామన్నారు. ప్రతి ఒక్కరు నివాస ప్రాంతాల్లోనే ఓటు హక్కు, ఆధార్ కార్డు కలిగి ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, నాయకులు శ్రావణ్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ఆకస్మిక తనిఖీ



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ పనులను కమిషనర్ బి.శరత్‌చంద్ర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 5,13,16వ డివిజన్‌లలో చెత్త సేకరణ, శుభ్రత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 శాతం స్వీపింగ్, ఓపెన్ పాయింట్ల తొలగింపు తదితర వాటిని సక్రమంగా చేపట్టాలన్నారు. ఓపెన్ పాయింట్లల్లో చెత్తను తొలగించిన సమయంలో బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, ఇంచార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, కృష్ణ, వెంకటేష్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయంలో షెడ్డు ప్రారంభం



కట్టమైసమ్మ దేవాలయ షెడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

బండ్లగూడ: ప్రజలంతా సమాజ సేవలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరెడ్డి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని కట్ట మైసమ్మ దేవాలయానికి అనంతరెడ్డి కుటుంబ సభ్యులు షెడ్డు నిర్మించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూలపల్లి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడుతూ ఆయన పేద ప్రజల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలను వారి కుటుంబ సభ్యులు ముందుకు తీసుకుపోవడం అభినందనీయమన్నారు. అనంతరం హైదర్షాకోట్‌లోని కస్తూర్బా ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనంతరెడ్డి భార్య అండాలు, మల్లికార్జున్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కౌసర్



ఫిర్యాదులు తీసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పేదలకు అండగా ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం పలువురు ఆయన వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకున్నారు. మరికొందరు తాము డబుల్ బెడ్‌రూంకు దరఖాస్తులు చేసుకున్నామని తమకు ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని విధాలుగా అర్హులైన వారికి ప్రభుత్వం డబుల్ ఇళ్లు కేటాయిస్తుందన్నారు. ఇళ్ల కేటాయింపులో ఎవరి ప్రమేయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తుల విచారణ కోసం ప్రత్యేక బృందాలు వస్తాయని నిష్పక్షపాతంగా విచారణ జరపాలని తనిఖీ బృందాలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకలు



సమ్మేళనంలో పాల్గొన్న సభ్యులు

బండ్లగూడ: 1973వ బ్యాచ్ ఆర్ఎస్ఐల గోల్డెన్ జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మాసబ్‌ట్యాంక్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాలు విధులు పూర్తి చేసుకున్న ఐ.రాఘవరావును ఘనంగా సన్మానించారు. రిటైర్మెంట్ తరువాత కూడా 15 సంవత్సరాల నుంచి పోలీసు అకాడమిలో విధులు నిర్వహిస్తున్న ఐ.రాఘవరావును బ్యాచ్ సభ్యులంతా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు కన్వీనర్‌గా కె.యాదవరెడ్డి, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు రాఘవరావు, సాయన్న, సుశీలరావు, ఆర్.వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ నుంచి దాదాపు 20 మంది విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు తేడా .. ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు



శంషాబాద్: గగన్‌పహాడ్‌లోని ఓ మాల్‌లో స్థానికంగా ఉండే కిరణ్ అనే వ్యక్తి వస్తువులు కొనుగోలు చేశాడు. ఇంటి వద్దకు వెళ్లాక బిల్లు చెక్ చేస్తే వందల రూపాయలు తేడా రావడంతో మాల్ వద్దకు వెళ్లి ఆందోళన చేశాడు. దీంతో నిర్వాహకులు బిల్లు వేసే వ్యక్తి తప్పిదంగా సర్దిచెప్పారు. తదనంతరం మరోసారి బిల్లు వేసే సందర్భంలో కూడా తప్పుగా రావడంతో బాధితుడు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడి చేరుకుని మెట్రో నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.సాంకేతిక పొరపాటు వల్ల బిల్లులు తేడా వచ్చాయని నిర్వాహకులు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేయాలని బాధితుడు పోలీసులను కోరాడు.